

సన్నటి ఆ తారు రోడ్డు మీద మన దేశ ప్రగతిలా నెమ్మదిగా సాగుతోంది ఆ ఎర్రబస్సు. ఓ వైపు ఎండ తన ప్రతాపాన్ని చూపిస్తోంది. మరో వైపు కిక్కిరిసిన బస్సు. తనకలవాటైన పద్ధతిలో స్టాప్‌లో ఆగకుండా స్టాప్‌కు వంద గజాల దూరంలోనో, ముందుగానో ఆపుతున్న డ్రైవర్‌ని చూసి దిగే ప్రయాణీకులు అడ్డుకుంటూ, ఎక్కే ప్రయాణీకులు నొచ్చుకుంటూ నిట్టూరుస్తున్నారు.

బస్సు సడెన్ బ్రేకుతో ఆగింది. బస్సుకు ఎదురుగా ఓ ముష్టివాడు పైగా కుష్టువాడు. వేలి మొనలు మొండిబారి, రసి కారుతూ చెమటలు కక్కుకుంటూ బస్సుకు అడ్డంగా నిలబడ్డాడు.

"నా బస్సే దొరికిందా నువ్వు చావడానికి?" బస్సు డ్రైవర్ బస్సాపి కోపంగా అన్నాడు. అప్పటికే ఆ కుష్టు ముష్టివాడు బస్సులోనికి ఎక్కేశాడు.

"ఏయ్...దిగు...దిగు.." కండక్టర్ అసహ్యంగా అరిచాడు.

"అమ్మో! కుష్టోడు...ముష్టోడు..." ప్రయాణీకులు చీదరించుకున్నారు.

"దింపేయండి చూస్తారేమిటి?" ఓ

నలభయ్యేళ్ళ ఆసామి అరిచాడు.

"అమ్మో...నేను ముట్టుకుంటానా?" కండక్టర్ అసహ్యంగా అతని వైపు చూస్తూ అంటున్నాడు.

"మీ అందరికీ దండం పెడతాను బాబయ్యా! పక్కూళ్ళో నా బిడ్డ పురిటికుంది. జల్దీ ఎల్లాలి...మీ అందరూ పక్కూరు వచ్చే లోపు తలా కొంత దానం చేస్తే మీ పేరు చెప్పుకుంటాను"అతను రెండు మొండి చేతులతో దండం పెట్టాడు.

"ఛీ...ఛీ...వచ్చే స్టాప్ వరకు మాతో ఉంటావా?" కొందరు చీదరించుకున్నారు. మరి కొందరు అసహ్యించుకున్నారు.

"చూస్తారేమిటి దించకుండా?" ఓ ముసలావిడ అంది.

"అయినా హోటళ్ళలో కుష్టు రోగులు రావద్దు అని బోర్డు పెట్టినట్టు బస్సుల్లోనూ పెట్టాలి" యాభయ్యేళ్ళ ప్రభావతమ్మ దీర్ఘం తీసింది.

"ఛీ...ఛీ... ఇలాంటి వాళ్ళంతా తమ వికృతి రూపాన్ని చూపి బెదిరించి డబ్బులు అడుక్కునే బాపతు" పొన్నుస్వామి అనే ప్రయాణీకుడు రెచ్చిపోయి అన్నాడు.

"బస్సులో సుఖంగా ప్రయాణిద్దామన్నా వీలు లేకపోయింది". ఇలా తలా ఒక రకంగా గొణుక్కుంటూ ఉన్నారు.

"ఇంతకీ అతన్ని దించుతారా? లేదా?" ప్రయాణీకులంతా మూకుమ్మడిగా కలసి డ్రైవర్ మీద గయ్‌మన్నారు.

"నన్నేం చేయమంటారు? వాణ్ణి ముట్టుకొని మెడ పట్టుకుని బయటకు గెంటనా? ఆ పని మీరే చేయండి" అన్నాడు ఆ ముష్టివాడి వంక అసహ్యంగా చూస్తూ.

బస్సు ఆగి అప్పటికే మూడు నిమిషాలు దాటింది. అందరూ అతడి గూర్చి కామెంట్ చేసుకుంటున్నా, ఎవరూ ధైర్యం చేసి అతడిని బయటకు పంపించలేకపోతున్నారు. తైల సంస్కారం లేని జుట్టు, చిరిగిన పొడవాటి చొక్కా, రసి కారే శరీరం, చేతిలో కర్ర, అతని వాలకమే వాళ్ళని అసహ్యపడేలా చేస్తోంది.

ఆ ముష్టివాడేమో ఇదంతా తనకు పట్టనట్టు 'రామనామం, రామనామం..రమ్యమైనదీ రామ నామం...' అంటూ తన చేతిలోని బొచ్చెని ప్రయాణీకుల ముందు పెడుతూ ముష్టి ఎత్తుకోవడంలో నిమగ్నమై ఉన్నాడు.

అతణ్ణి కదిలించడం అసాధ్యమని అర్థమైంది. ఎంత అరగంటలో పక్కూరు వస్తుంది. ఇంతకంటే మార్గం లేదు. కొందరు ప్రయాణీకులు సర్దుకున్నారు. బస్సు ముందుకు కదిలింది.

ఆ ముష్టివాడు హృదయ విదారకంగా అడుక్కుంటున్నాడు. తన కూతుర్ని మొగుడు వదిలేశాడని, తన కూతురు తన దగ్గరే ఉంటుందని రోజూ ఇలా బస్సులో అడుక్కోవడం తన బ్రతుకు మార్గం అని రకరకాలుగా తన బాధ చెప్పుకుంటున్నాడు.

చాలా మంది దానం చేయలేదు, కొద్దిమంది అసహ్యంతో. మరికొద్దిమంది తమ దగ్గర ఉన్న చెల్లని నాణేలను ఉదారంగా దానం చేశారు.

"అబ్బబ్బ వెధవ వేసవి కాలం...ఎండలు దంచేస్తున్నాయి. నోరు పిడచకట్టుకుపోతోంది. ఎవరి దగ్గరైనా నీళ్ళున్నాయా?" ప్రభావతమ్మ పక్కనున్న మరో ఆవిడని పలకరిస్తూ అంది.

"అయ్యోరామా...నీళ్ళుంటే ఎంత భాగ్యం...వచ్చేటప్పుడు బాటిల్ నిండా తెచ్చాను. చంటాడు ఖాళీ చేశాడు" తన దగ్గరున్న నిండు సీసాను సీటు కిందకు తోస్తూ అందావిడ. బస్సు చాలా నెమ్మదిగా నడుస్తోంది.

"దగ్గర్లో ఏదైనా పంపు ఉంటే బావుండు.. దాహంతో చస్తున్నాను..." పొన్నుస్వామి అనే ప్రయాణీకుడు పైకే అన్నాడు.

బస్సులో వున్న చాలామందికి ఇదే ఆలోచన అందరూ కలిసి కండక్టర్‌కు చెప్పారు.

"ఎక్కడైనా పంపు కనిపిస్తే ఆపించరూ.. అందరం దాహంతో చస్తున్నాం..."అంటూ.. బస్సు కాస్త ముందుకెళ్ళాక ఎడం చేతి వైపు ఓ బోర్ కనిపించింది. "డ్రైవర్...బస్సాపు...అక్కడ బోర్ ఉంది" ప్రయాణీకులు అరిచారు.

బస్సాగింది.

ప్రయాణీకులు బిలబిలమంటూ దిగారు. ఒకరు బోర్ కొడుతుంటే మరొకరు బోర్ కింద దోసిల పెట్టి నీళ్ళు తాగుతున్నారు.

"అమ్మా...దాహం వేస్తుందే..."ఎనిమిదేళ్ళ బబ్లూ తల్లితో చెప్పాడు.

"నాకు బస్సులో నుంచి కదిలే ఓపిక లేదు. వెళ్ళు...ఎవరినైనా బోర్ కొట్టమని చెప్పి నీళ్ళు తాగిరా..."అంటూ ఆ తల్లి కళ్ళు మూసుకుంది. బబ్లూ కిందకి దిగాడు.

ప్రయాణీకులు ఒక్కరొక్కరే బస్సు ఎక్కేస్తున్నారు. బబ్లూ ఎవరిని బోర్ కొట్టమని అడగాలా? అని ఎదురు చూస్తున్నాడు. అందరూ లోపలకెళ్ళారు.

"ఏంటి బాబూ...దాహం వేస్తోందా?" ముష్టివాడు అడిగాడు.

అవునన్నట్లు తలూపాడు.

"నేను బోర్ కొట్టనా? నువ్వు తాగుతావా?" అనుమానంగా అడిగాడు ముష్టివాడు.

"అలాగే"అన్నట్లు తలూపి బోరుముందు దోసిలి పట్టాడు బబ్లూ.

ముష్టివాడు బోర్ కొడుతున్నాడు.

ఆ దృశ్యంలోని బస్సులోని ప్రయాణీకులు చూసేశారు.

"ఛీ...యాక్...థూ...అబ్బ...ఛీ...ఛీ.." రకరకాల విసుర్లు..."చూడు... ఆ పిల్లవాడు ఆ కుష్టునా కొడుకు బోర్ కొడితే తాగుతున్నాడు..." అసహ్యాన్ని అంతా మొహంలోనే చూపిస్తూ కామెంట్ చేస్తున్నారు.

బబ్లూ తల్లి బయటకు చూసింది. వెంటనే ఉగ్రరూపంతో కిందికి దిగి, కొడుకును లాగి ఆ చెంపా, ఈ చెంపా వాయించింది. "దరిద్రుడా...బుద్ధి లేదు. ఆ కుష్టువాడు బోర్ కొడుతుంటే నీళ్ళు తాగుతావా? ఒళ్ళు చీరేస్తా..."ఇలా తిడుతూ కొడుతూనే ఉంది.

ముష్టివాడు బాధగా ఆవిడ దగ్గరకి వచ్చి



"ఇందులో బాబు తప్పు ఏదీ లేదు తల్లీ...బాబును కొట్టొద్దు" అని వేడుకున్నాడు. కొడుకు కుష్టువాడు బోర్ కొడితే నీళ్ళు తాగాడన్న బాధ కన్నా పదిమంది ఆ దృశ్యం చూశారన్న కోపమే ఎక్కువగా ఉంది తల్లికి.

"అసలు వాడ్ని తన్నాలి..." మరికొందరు బస్సులోని వృద్ధ యువకులు (కొంతమంది యువకులు పుట్టుకతోనే వృద్ధులన్న శ్రీశ్రీకి జోహార్లు) ముందుకొచ్చి ముష్టివాడి వికృత రూపం చూసి అడుగు వెనక్కి వేశారు.

ఐదు నిముషాల్లో గొడవ సద్దుమణిగింది. బబ్లూ ఏడుస్తూనే ఉన్నాడు.

"ఇక మీరు గొడవ ఆపేయండి. ఇప్పుడు వంతెనమీద నుంచి బస్సు వెళ్తుంది. కిందికి చూస్తే కళ్ళు తిరుగుతాయి. జాగ్రత్తగా కూర్చోండి" డ్రైవర్ హెచ్చరించాడు. వంతెన దాటితే ఊరొస్తుంది. పురాతన కాలం నాటి వంతెన. వంతెన కింద పెద్ద కాలువ.

డ్రైవర్ జాగ్రత్తగా నడపాలని ప్రయత్నిస్తూనే ఆర్టీసీ వారు' అప్పుడప్పుడు చేసే ఘనకార్యాన్ని చేసేశాడు.

బస్సు అదుపు తప్పింది.

అంతే...

కాలువలోకి పరుగెత్తింది. కాలువకు, వంతెనకు మధ్య వేలాడుతూ ఆ ఎర్ర బస్సు కేకలు... అరుపులు... పెడబొబ్బలు... ఆర్తనాదాలు ... కొందరు కాలువలో పడిపోయారు.

అందులో చాలా మందికి ఈత రాదు. ఇంకొందరు భయంతో అరుస్తూ బిగదీసు కున్నారు. "రక్షించండి... రక్షించండి..." అంటూ అరుస్తున్నారు. ఎవరికి ఏం చేయాలో తోచడం లేదు.

బబ్లూ తల్లి, పొన్నుస్వామి, ప్రభావతమ్మ, డ్రైవర్‌తో సహా కాలువలో చాలా మంది పడిపోయారు.

ముందు తేరుకుంది ముష్టివాడు. బస్సులో నుంచి అమాంతం దూకేశాడు. ఈ పరిసరాలు, కాలువ అతనికి కొత్త కాదు. ఈత కొత్త కాదు. ముందుగా కేకలు వేస్తోన్న డ్రైవర్‌ని సమీపించాడు.

"నన్ను బయటకు తీయ్... నీకు పుణ్యం ఉంటుంది..." బ్రతిమిలాడుతున్నాడు.

అతన్ని బయటకు తీసుకువచ్చాడు ముష్టివాడు.

అందరిలో "ప్రాణభయం... నన్ను కాపాడు... నన్ను కాపాడు...." అంటూ అందరూ ఆ ముష్టివాడిని ప్రాధేయపడుతున్నారు.

కుష్టుతో మొండిబారిన అతని చేతివ్రేళ్ళను గమనించడం లేదు. రసి కారుతున్న అతని శరీరాన్ని అసహ్యించుకోవడం లేదు. అతన్ని పట్టుకుని అతని ఆసరాతో బయటకు వస్తున్నారు. కారణం... ప్రాణభయం.

తన శక్తివంచన లేకుండా ఒక్కొక్కర్నీ పైకి తీస్తున్నాడు. తన శక్తినంతా కూడదీసుకుంటున్నాడు. ఉదయం నుంచి ఏమీ తినలేదు. అయినా ప్రయాణీకులను, తోటి మనుషులను ఆదుకోవాలన్న స్పృహతో... తను స్పృహ కోల్పోయినా పర్వాలేదు అన్న పట్టుదలతో. చివరికి మిగిలింది బబ్లూ తల్లి.

బబ్లూ నీటిలో మునుగుతూ తేలుతూ మరణం చివరి అంచులో ఉన్న తల్లిని చూసి ఏడుస్తున్నాడు. ముష్టివాడి శక్తి నీరసిస్తోంది. అయినా చివరి ప్రయత్నం. బోర్లా పడుకుని ఆమెకు చేయి అందించి ఆమెను పైకి లాగి, పట్టు తప్పి తను కాలువలోకి పడిపోయాడు.

అందరూ పైకి వచ్చారు. ముష్టివాడు మాత్రం కాలువలో పడిపోయాడు. ఆసరా కోసం చేయూత అడిగాడు.

అప్పటివరకు ప్రాణభయంతో బిగిసి, ముష్టివాడి చేయూతతో ప్రాణాలు రక్షించుకున్న బస్సులోని జనం ఇప్పుడు ముష్టివాడిని, పైగా రసి కారుతూ అసహ్యంగా ఉన్న కుష్టువాడిని పైకి లాగటానికి సంశయిస్తున్నారు.

"అబ్బో... అతని చేతులు చూడు..." తడిసిన బట్టలను చూసుకుంటూ ఓ వ్యక్తి కామెంట్.

"ఏం చేద్దాం?" అప్పటి వరకూ ప్రాణభయంతో సగం చచ్చి కుష్టువాడి వల్ల ప్రాణాలు కాపాడుకున్న కండక్టర్‌కు ధర్మ సందేహం.

"అమ్మా... అతను నీళ్ళలో మునిగిపోతున్నాడే..." బబ్లూ బాధగా తల్లితో అన్నాడు.

"నోర్మూయ్... వెధవ. వేలెడంత లేవు... నీకెందుకు?" అప్పటి వరకు ఆ ముష్టివాడి వల్లే తను బ్రతికానన్న విషయాన్ని, కృతజ్ఞతను విస్మరించి కొడుకు మీద అరిచింది తల్లి.

ఆ ముష్టివాడికి శక్తి సన్నగిల్లింది. మెల్లమెల్లగా తల నీళ్ళలో మునిగిపోతోంది.

బబ్లూ ఒడ్డుకు పరుగెత్తాడు. తన చిన్న చేతిని అతని చేతికి చేయూతగా అందించబోయాడు.

అప్పుడు... అప్పుడు... చివరిసారిగా చూశాడా ముష్టివాడు. అతని కళ్ళు కన్నీళ్ళతో మెరిసి, కాలువలోనే రెండు కన్నీటి బొట్లు రాలిపడ్డాయి.

"వద్దు బాబూ... నా చేతిని అందుకుని నేను ఒడ్డుకు వచ్చే లోపు నా బరువు మోయలేక, నువ్వు కాలువలో పడి ఛస్తావు... నా ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు నిండుగా బ్రతుకు బాబూ....

ఈ పెద్ద మనుషుల్లో లేని స్పృహ, నీ చిన్ని మనసులో ఉంది. పెద్దయ్యాక నీ కొడుక్కి ఇలాంటి మానవత్వం నేర్పు. ఇంకా ఈ మనుషుల్లో కొందరిలోనైనా స్పృహ ఉందని చచ్చేముందు నిన్ను చూసి తెలుసుకున్నాను" అని మనసులో అనుకుని మొండిగా వున్న రెండు చేతులను జోడించి క్రమక్రమంగా నీటిలోకి మునిగి అదృశ్యమయ్యాడు.

బస్సులోని ప్రయాణికులను కాపాడి మానవత్వాన్ని బ్రతికించి అతను చచ్చిపోయాడు. మానవత్వాన్ని చంపుకుని ఆ ప్రయాణీకులు బతికారు. వాళ్ళిద్దరి మధ్య ఆ చిన్నారి....?

*

